ప్రజాప్రతినిధులకు దక్కని గౌరవం

- ఏడాదిన్నరకు పైగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు లేవు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వని వైనం
- గ్రామపంచాయతీలకు ఏడాదికి పైగా మంజూరు కాని 15 ఆర్థిక సంఘం నిధులు
- గ్రామాల్లో కనీస పనులు చేయలేని స్థితిలో సర్పంచ్‌లు


మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు(ఫైల్)

బేతంచెర్ల : మండల స్థాయిలో ఆయా గ్రామాల నుంచి ఎన్నికైన ఎంపీటీసీలకు ఏడాదిన్నరకు పైగా గౌరవ వేతనాలు ఇవ్వక పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రభుత్వ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ.. ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గ్రామ పంచాయతీలకు సైతం ఏడాది కాలంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడంతో ఆయాగ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

ఏడాదిన్నరకు పైగా అందని వేతనాలు

డోన్ నియోజకవర్గంలోని డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో ఎంపీటీసీలు డోన్‌-18, ప్యాపిలి- 21, బేతంచెర్ల-15 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ. 3వేల గౌరవ వేతనం ఇవ్వాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో 3 విడత నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అయితే ఎంపీటీసీల గౌరవ వేతనాలు బిల్లులు పెడుతున్నామని అధికారులు చెబుతున్నారే తప్ప, వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమకు అధికారులు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నాయకులకే ప్రాధాన్యం..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ రాజకీయ కోణంలో చూస్తూ తమను పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధిక శాతం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ కి చెందిన వారు కావడంతోనే ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్పంచ్‌ల పవర్‌కు ఎసరు..

డోన్‌-31, ప్యాపిలి 31, బేతంచెర్ల -19 మొత్తం 76 మంది సర్పంచ్‌లు ఉన్నారు. గ్రామ పంచాయతీలకు జానాభా ప్రాతిపదికన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతుంటాయి. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి ట్యాంకుల శుభ్రం, తాగునీటి మోటార్ల మరమ్మతు పనులు, డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ ఏడాదికి పైగా 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. అధికశాతం సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి పవర్‌కు ఎసరు పెట్టారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చడంతో తమ పంచాయతీలో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితి. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో జరుగుతున్న పనులు పేరుకే అన్న చందంగా మారాయి. సర్పంచ్‌ల ఆమోదం, తీర్మానం కూడా లేకుండా టెండర్ కోడ్‌తోనే కంట్రాక్టర్లు పనులు చేపడుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు సర్పంచ్‌ల ఖాతాలకు కాకుండా వెండర్ల ఖాతాల్లో జమ అవుతున్నట్లు సమాచారం. తమ అధికారాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు, గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

సమస్యలపై స్పందించలేక పోతున్నాం



మా కంటూ ప్రత్యేక నిధులు లేకపోవడంతో గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములం కాలేక పోతున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతున్నాం. గ్రామాల్లో చిన్న సమస్యను పరిష్కరించాలంటే నిధులుండాలి. చిన్న సమస్యను కూడా తీర్చలేక గ్రామాల్లో తలెత్తుకోలేక పోతున్నాం. దీనికి తోడు గౌరవ వేతనాలు కూడా ఇవ్వడం లేదు.

– రామ చంద్రారెడ్డి, అంబాపురం ఎంపీటీసీ

నిధులు మంజూరు కావడం లేదు



ఏడాదికి పైగా 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటి వరకు పారిశుద్ధ్యం, తాగునీటి మోటార్ల మరమ్మతు పనులకు నిధులు లేక అప్పులు చేశాం. ఇప్పటి నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి మోటార్ల మరమ్మతు పనులు కూడా చేపట్టలేం. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సర్పంచ్‌లను ఆదుకోవాలి.

– చిట్టి వేణుగోపాల్ రెడ్డి, డోన్ నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్దనస్వామి ఆలయాల్లో మంగళవారం నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో ఆలయాలను పునర్నిర్మించారు. విగ్రహ ప్రతిష్టలో భాగంగా మొదటి రోజు గోపూజ, గంగానయనము, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ వాచనము, మాతృకాపూజ, పంచగవ్యమేళన, ప్రోక్షణ, ప్రాశన, యాగశాల ప్రవేశం, ద్వార పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతిష్టా ఉత్సవాలు మూడు రోజులపాటు కొనసాగుతాయని గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నంద్యాల జిల్లా యాళ్లూరు గ్రామానికి చెందిన గంగుల శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి కృష్ణవేణి కుటుంబ సభ్యులు రూ.1,00116ల విరాళాన్ని మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దాత కుమార్తె జ్యోతి, అల్లుడు ప్రవీణ్‌రెడ్డి, వీరి కుమారుడు దినేష్‌రెడ్డి ఉన్నారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులను దుశ్శాలువా పూల మాలవేసి ఘనంగా సన్మానించి, అమ్మవారి ప్రసాదం అందజేశారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు!

కొలిమిగుండ్ల: నడవలేని దివ్యాంగులు, అంధులు, మంచానికే పరిమితమైన వారి పింఛన్లపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. ఆరు నెలల క్రితం దివ్యాంగుల పింఛన్ తీసుకునే వారికి నంద్యాల, బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రుల్లో రీవెరిఫికేషన్ చేశారు. వీటికి సంబంధించిన సదరం సర్టిఫికెట్ల జాబితాను మంగళవారం ఆన్‌లైన్‌లో ఆయా గ్రామ సచివాలయాలకు పంపారు. సచివాలయ సిబ్బంది జాబితా ప్రదర్శించారు. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అంకిరెడ్డిపల్లెలో 14 మంది, కొలిమిగుండ్లలో 13 మంది దివ్యాంగులు పేర్లు రిజెక్ట్ అయినట్లు జాబితాలో కనిపించడంతో లబ్ధిదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండల వ్యాప్తంగా పదుల సంఖ్యలో పింఛన్లు తొలగించినట్లు తెలుస్తోంది. వీరందరికి సెప్టెంబర్ నెలలో పింఛన్ సొమ్ము రాదని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

డోన్ టౌన్ : భారతదేశ ప్రజల ఐక్యతను చాటేందుకు ప్రతి ఒక్కరూ ఆగస్టు 15వ తేదీన ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని డ్వామ పీడీ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉడుములపాడు గ్రామంలోని ఉపాధి హామీ పథకం శ్రామికులు, గ్రామ సర్పంచ్ ఉప్పరి రాధమ్మతో కలిసి జెండా ఆవిష్కరించారు. అలాగే స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాస్ హర్ ఘర్ తిరంగా స్టిక్కర్లను విడుదల చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆగని విద్యుత్ తీగల చోరీలు

సంజామల: సంజామల మండలంలో విద్యుత్ తీగలు చోరీలు ఆగడం లేదు. కాపర్ తీగల దొంగలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో గత నెలలో దాదాపు 20 మంది రైతుల విద్యుత్ తీగలు, ఆకుమల్ల గ్రామంలో జూన్ నెలలో దాదాపు రూ.32 వేలు విలువ చేసే వ్యవసాయ మోటారు చోరీకి గురైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం రాత్రి ఆకుమల్ల గ్రామంలో దాదాపు 60 మీటర్ల విద్యుత్ తీగ చోరీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల స్పందించి విద్యుత్ తీగలు చోరీకి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలి

కోవెలకుంట్ల: వివిధ ఆదాయ వనరుల ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు సూచించారు. మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్లలోని చెత్త నుంచి సంపద సృష్టికేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ)లో వర్మీకంపోస్టు తయారీకి ఏర్పాటు చేసిన 15 తొట్లలో వానపాములు వదిలారు. ఆయన మాట్లాడుతూ పశువుల పేడ, తడిచెత్త, వానపాములతో అక్టోబర్ 10వ తేదీ నాటికి 25 టన్నుల వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి కిలో రూ.10 ప్రకారం రైతులకు విక్రయిస్తామన్నారు. వచ్చిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి గ్రామ పంచాయతీ అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు.

జీఓ రద్దు చేయాలి


కోవెలకుంట్లలో డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కోవెలకుంట్ల: విజయవాడలోని గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలూ సంస్థకు బదలాయిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం స్థానిక డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తి అయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడాన్ని ఆపాలని, రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు నరసింహులు, రాముడు, ఓబులేసు, కేవీపీ సుబ్బయ్య, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

బనగానపల్లె : బనగానపల్లె ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మంగళవారం ఎన్ఎంయూఏ అధ్యక్షుడు జంబులయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల వెంటనే ఇవ్వాలని, పీఆర్‌సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజినల్ మెంబరు ఎస్ఎస్ వలి యల్లయ్య, గ్యారేజ్ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, గఫార్ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ప్రపంచంలో జరుగుతున్న అనేక విషయాలను తెలుసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో పదివేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రమణారెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, కృష్ణదాసు, ఈవీ భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల : గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యావంతులై ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ యూత్ డేను పురస్కరించుకొని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్తంగా రెండు నెలల పాటు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన ప్రచారాన్ని డీఎస్పీ మంగళవారం ప్రారంభించారు. హెచ్ఐవీ ఉన్న వారిని ఆదరించాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మధుకుమార్, వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, అధ్యాపకులు రమేష్ రెడ్డి, కుళ్లాయి రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సరస్వతి, సోఫియా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బేతంచెర్ల : పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాయక్, కార్యవర్గ సభ్యులు భార్గవ్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు.

బనగానపల్లె రూరల్ : స్థానిక ఎస్సీ కళాశాలల బాలుర వసతి గృహం ఆవరణలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

భూముల రీ సర్వేపై అవగాహన

బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, వైస్ ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ, వీఆర్వో మధు ఆధ్వర్యంలో రైతులకు భూముల స్వచ్ఛీకరణ, రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి రైతులకు సూచించారు. ముఖ్యంగా కుటుంబ యజమాని చనిపోయి ఆన్‌లైన్‌లో అతని పేరు ఉంటే తొలగించి వారసుల పేరును ఎక్కించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాల కృష్ణ, శివనాగయ్య, విలేజ్ సర్వేయర్లు సోఫియా బేగం, వేణు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించాలి

బేతంచెర్ల : ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ మారుతికి అందజేశారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

డోన్ టౌన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఎస్టీఎఫ్ఐ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు లతీఫ్, రామమూర్తి, లక్ష్మీనాయక్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణానికి మంచినీటి సరఫరా చేసే ప్రధాన నీటి వనరు గాజులదిన్నె ప్రాజెక్టు పైపు లైను లీకేజ్ కారణంగా బుధవారం పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పైపు లైను మరమ్మతులు చేపట్టి 14వ తేదీ యథావిధిగా నీటి సరఫరా కొనసాగిస్తామన్నారు.


వాగు వద్ద కొట్టుకుపోయిన మట్టి కట్ట వద్ద యథావిధిగా మట్టి వేస్తున్న దృశ్యం

కొట్టుకుపోయిన మట్టి కట్ట


కోతకు గురైన చీనీతోటను చూపుతున్న రైతు

కొలిమిగుండ్ల: వాగుకు అడ్డంగా నీళ్లు రాకుండా అడ్డుగా వేసిన మట్టి కట్ట కొట్టుకుపోవడంతో నీళ్లు భారీగా పంట పొలాల్లోకి చేరి బీభత్సం సృష్టించాయి. పెట్నికోట సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటిక్యాల సమీపంలో ప్రధాన రహదారి నుంచి ఫ్యాక్టరీ వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి ఇబ్బంది కలుగకుండా వాగు వద్ద నీళ్లు రాకుండా పెద్దగా మట్టి కట్ట వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి వరదనీరు పెద ఎత్తున రావండతో వాగు వద్ద అడ్డుగా వేసిన మట్టి కట్ట కొట్టుకుపోయింది. దీంతో దిగువన పొలాలు, చీనీ తోటల్లోకి నీళ్లు చేరాయి. భూమి పెద్ద ఎత్తున కోతకు గురైంది. రైతు మద్దిలేటిరెడ్డి చీనీతోటలో చెట్లపై నుంచి నీరు పారడంతో కొన్ని చెట్లు దెబ్బతిన్నాయి. చీనీ కాయలు సైతం నీళ్లలో కొట్టుకుపోయాయని వాపోయాడు. ఇదిలా ఉండగా ఇండస్ట్రీయల్ పార్కులో కల్వర్టు వద్ద రోడ్డు భారీగా కోతకు గురైంది. నీటి ప్రభావం జమ్మలమడుగు క్రాస్ రోడ్డు వరకు చూపింది. దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో వ్యాపారులు నష్టపోయారు. వాగుకు అడ్డంగా మట్టి కట్టవేయడంతోనే ఈపరిస్థితి ఏర్పడిందని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. కాగా, కొట్టుకుపోయిన చోట మళ్లీ వాగుకు అడ్డుగా మట్టి వేస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


ప్యాపిలిలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : వ్యక్తిగత పరిశుభ్రతతోనే శరీరంలోని నులి పురుగులను నివారించుకోవచ్చని చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, సూపర్‌వైజర్ చెన్నయ్య, ఏఎస్ఎంలు ఇంద్ర, సుమలత తదితరులు ఉన్నారు.

- **డోన్:** మండలంలోని ఎద్దుపెంట జిల్లాపరిషత్ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివశంకర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ అధికారి ప్రణీత్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **ప్యాపిలి:** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు రాహుల్, రాజారావు అన్నారు. స్థానిక కేజీబీవీలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.
- **సంజామల:** మండల పరిధిలోని పేరుసోముల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో చిన్నారులకు మాత్రలను మంగళవారం పింపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు.
- **కొలిమిగుండ్ల:** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులు మండలంలో 8,317 ఉండగా మొదటి రోజే 7,911 మందికి మాత్రలు వేశామన్నారు.
- **కోవెలకుంట్ల:** స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి ,అధ్యాపకులు నరేంద్రనాథరెడ్డి, సంటిరెడ్డి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 94 మంది ఎంపిక


కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 94 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, జొమాటో, అమెజాన్, దొడ్ల డెయిరీ, ఎస్ఎస్ ఇనిస్ట్యూట్‌ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తదితర పది కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 196 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ అర్హత పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన చరణ్

బనగానపల్లె: నంది వర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామ కృష్ణాపురం అడ్డా రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మ రణం చెందాడు. ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు... బేతంచర్ల పట్టణానికి చెందిన చరణ్ (19) ప్రతి రోజు బైక్‌పై ఊరూరా తిరుగుతూ మిక్సీలు గ్యాస్ స్టవ్‌లు రిపేరు చేస్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం పలుకూరు గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రామకృష్ణాపురం అడ్డా రోడ్డులోని తోడేళ్లగుట్ట వద్ద బేతంచర్లకు చెందిన మని అయ్యర్ అనే వ్యక్తి ట్రాలీ ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో చరణ్ తలకు చేతులకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి మధు ఫిర్యాదుతో నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పొంగిన కుందూనది


గుళ్లదూర్తి వద్ద కుందూనది వంతెనపై ప్రవహిస్తున్న వరద

కోవెలకుంట్ల: శ్రీశైలం జలాశయం నుంచి కుందూనదికి భారీగా నీటి విడుదల చేయడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఏకమయ్యాయి. దీంతో మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి, కలుగొట్ల, వల్లంపాడు గ్రామ సమీపాల్లో ప్రవహిస్తున్న కుందూనది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆయా ప్రాంతాల్లో వంతెనలపై మోకాళ్లలోతు వరద నీరు ప్రవహిస్తుండటంతో గుళ్లదూర్తి-హరివరం, కోవెలకుంట్ల- లింగాల, కలుగొట్ల- పెద్దకొప్పెర్ల గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. కుందూకు వరదనీరు పోటెత్తడంతో మండలంలోని లింగాల సమీపంలో ఉన్న పాలేరు, వల్లంపాడు వద్ద చిన్నవంచెవాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. నది, వాగుల పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలను వరదనీరు ముంచెత్తింది.

ఉపాధి పనుల్లో అవినీతి

ప్యాపిలి: మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సోషల్ ఆడిట్‌కు సంబంధించి డ్వామా పీడీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ప్యాపిలి మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 19 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, పీఆర్ తదితర పనులు చేపట్టారు. దాదాపు రూ. 25 లక్షలతో చేపట్టిన పలు రకాల పనులకు ఎంబుక్‌లో పొందుపరచిన వివరాలతో పొంతన లేదని డ్వామా పీడీ వెల్లడించారు. పలువురు ఫీల్డు అసిస్టెంట్ల నుంచి రూ. 84,830 రికవరీకి ఆదేశిస్తూ.. కొందరికి రూ. 22 వేలు పెనాల్టి విధించారు. బహిరంగ విచారణలో డీడీఓ నరసింహారెడ్డి, డీపీఓ అన్వరా బేగం, ఎస్టీఎం కోనయ్య, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, ఏపీఓలు రమణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

డోన్ టౌన్ : మండలంలోని ఇంద్రాంపల్లె గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు గుండంమీది సుంకన్న (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా నాయకులు పులిశేఖర్ గ్రామానికి వెళ్లి భౌతికకాయంపై పార్టీ జెండా, పూల మాలలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.